

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త


## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

ప్రజా సమస్యల సరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు.సోమవారం రోజున సమీకృత జిల్లా కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాని కార్యక్రమంలో ఫిర్యాదు దారులనుండి దరఖాస్తులను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు.ఫిర్యాదు దారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రాజావాణి కార్యక్రమంలో ఆసరా ఫించన్లు,భూ సంబందిత,హౌజింగ్‌లకు సంబందించి మొత్తం 44 దరఖాస్తులు వచ్చాయని వారికి తగిన న్యాయం జరిగేలా పని చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ,డిఆర్డీవో జగదేవ్ ఆర్య,ఏవో అబ్దుల్ రహ్మాన్‌తో పాటు జిల్లా అధికారులు ఉన్నారు.

## మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటా : సిపి అనురాధ

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు డిపార్ట్‌మెంట్ ఎప్పుడూ అండగా ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు.సోమవారం రోజున కోహెడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన కానిస్టేబుల్ నవీన్ గత సంవత్సరం నవంబర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబానికి డిపార్ట్‌మెంట్ తరుపున భరోసా నుండి వచ్చిన రూ 16లక్షల రూపాయల చెక్కును కమిషనర్ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ విధి నిర్వహణలో పని మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు అండగా ఉండడంతో పాటు వారికి రావాల్సి న మరిన్న బెనిఫిట్స్ ను త్వరలోనే అందజేస్తామన్నారు.అనంతరం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వచ్చిన డబ్బులను వృదా చేసుకోకుండా పిల్లల చదువు విషయంలో లేదా వారి పేర్లపై ఫిక్స్ డిపాజిట్ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏవో యాదమ్మ, సూపరిండెంట్ మహ్మద్ ఫయాజుద్దిన్,రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షులు రవిందర్‌రెడ్డి,జూనియర్ అసిస్టెంట్ రవిరాజు,సిసి నితిన్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఓ అశోక్ చక్రవర్తి

## నేడు తడ్కల్‌లో భూభారతిపై అవగాహన సదస్సు

### -హాజరుకానున్న ఎంపి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

**కంగ్టి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఈ నెల 22న మండలంలోని తడ్కల్ గ్రామంలోని దేవి ఫంక్షన్‌హాల్‌లో భూభారతి-2025 చట్టంపై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆర్‌డిఓ అశోక్‌చక్రవర్తి పేర్కొన్నారు. సోమ వారం కంగ్టిలోని రెవెన్యూ కార్యాలయంలో ఆర్‌డిఓ తహసీల్దార్ భాస్కర్ తో కలిసి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జహీ రాబాద్ ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై భూభారతిపై అవగాహన కల్పిస్తారన్నారు. అవగాహన కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పొందాలని మండల ప్రజలకు సూచించారు. ఆర్‌డిఓ పేర్కొన్నారు.

## భూభారతితో భూసమస్యల పరిష్కారం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి




మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

**మిరుదొడ్డి, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** రైతుల సమస్యలు భూ భారతి ద్వార పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌధరి అన్నారు.సోమవారం రోజున మీరుదొడ్డి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి చట్టంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మతంగా తీసుకొచ్చిన భూ భారతిలో రికార్డులలో తప్పుల సవరణ,రిజిస్ట్రేషన్లు,సర్వే మ్యాప్‌ల తయారీ పెండింగ్ సాధాబైనామా దరఖాస్తులు ,పరీక్షలకు ఇద్ది చక్కని వేదిక అన్నారు.కార్యక్రమంలో జిల్లా అధనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్,ఆర్డీవో సదానందం,మండల స్పెషల్ ఆఫీసర్ గణేష్‌రామ్, తహసీల్థార్ ఉదయ,ఎంపిడివోతో పాటు తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను సద్వియోగం చేసుకోవాలి

### హౌజింగ్ కార్పొరేషన్ ఎండి గౌతమ్



మెదినిపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎండి గౌతమ్

**కొండపాక, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు కట్టించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టి రూ॥ 5 లక్షలు అందిస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణాల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండల పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్న మెదినిపూర్ గ్రామాన్ని అయన సందర్శించి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను, లబ్దిదారుల లిస్ట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరు ఇల్లు నిర్మించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్దిదారులందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లబ్దిదారులు ప్రభుత్వ నిబంధనల మేరకు 100 చదరపు గజాల్లోనే ఇల్లు నిర్మించుకుంటే ప్రభుత్వం మంజూరి చేసే డబ్బులు సరిపోతాయన్నారు. ఇండ్ల నిర్మాణంలో పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలను, లోటుపాట్లను, అడిగి తెలుసుకొని పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. అయన వెంట సిద్దిపేట అడిషన కలెక్టర్ గరీమా అగర్వాల్, పిడి దామోదర్, కొండపాక, కుకునూరుపల్లి ఎంపిడిఒలు వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, పిఆర్ ఎఈ తిరుపతిరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో గుణాత్మకమైన మార్పులకు ప్రధాని శ్రీకారం

### మెదక్ ఎంపి రఘునందన్‌రావు

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** దేశంలో గుణాత్మకమైన మార్పులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని బిజెపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టంపై పేద ముస్లింలలో అపోహలు సృష్టిస్తూ అల్లర్లురేపే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. జహీరాబాద్ నియోజకవర్గంలో మొత్తం 12,892 ఎకరాలు వక్ఫ్ భూములుగా నమోదు చేయడంవల్ల వేలాది మంది రైతులు హక్కులు కోల్పోయారని తెలిపారు. కొండాపూర్ మండలం సైదాపూర్ లో 197 ఎకరాలు వక్ఫ్ జాబితాలో చేరడం వల్ల సుమారు 200 మంది రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్కల్, రాయికోడ్ మండలాల్లో పెద్ద ఎత్తున భూములు వక్ఫ్ జాబితాలో చేరాయని ఆరోపించారు. రాష్ట్రంలో పాతబస్తీ వక్ఫ్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి బహిరంగంగా వివరాలు ఇవ్వాలనీ, ముతావలీలు ఎవరి పేర్లపై లీజులకు ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో వక్ఫ్ భూములు ఆక్రమణకు గురవుతున్నా, అసలు లబ్దిదారులైన పేద ముస్లింలకు ఉపయోగం లేకుండా పోతోంది. తప్పుడు ప్రచారాలు నమ్మొద్ద ని రైతులు, ప్రజలు చట్టంపై అవగాహన పెంచుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వ మోనాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సమావేశంలో జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాజీ ఎంపీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

## భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**జహీరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** భూభారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఉండాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో, మొగుడంపల్లి మండలంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో భూభారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. భూభారతితో రైతులకు కలిగే ప్రయోజనాలపై కలెక్టర్ వివరించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటష్ ద్వారా కలెక్టర్ చట్టంలోని ప్రతి అంశంపై అవగాహన కల్పించారు. రైతులు ఏడాది కాలంలోగా భూభారతి పోర్టల్ ద్వారా ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే కలెక్టర్‌కు, సీసీఎల్ఏకు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. చట్టంలో ల్యాండ్ ట్రిబ్యూనల్ అందుబాటులో ఉంటుందన్నారు. ధరణిలో రెవెన్యూ కోర్టులను తొలగించడంతో భూ వివాదాల వషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేందని, ఫలితంగా రైతులు పడుతున్న పాట్లను గుర్తించిన ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమలు చేసిందని, రెవిన్యూ కోర్టులను పునరుద్ధరించిందన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి ప్రతి సంవత్సరం గ్రామాల్లో రికార్డులను డిస్‌ప్లే చేయడం జరుగుతుందన్నారు. రెవిన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ధరణిలో ఉన్న భూ రికార్డులు భూభారతిలో కొనసాగుతాయన్నారు. భూ హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు ఏడాదిలోగా ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూభారతి చట్టంలో అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి జిల్లా అదనపు కల్టెకర్ మాధురి, ఆర్‌డిఓ రామిరెడ్డి, తహసీల్దార్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

## భూభారతితో భూ సమస్యలకు పరిష్కారం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**టేక్మాల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** భూభారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం లభిస్తుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం టేక్మాల్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన భూభారతి అవగాహన సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భూముల సమస్యలు పరిష్కారం కాక రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం భూభారతి ద్వారా కార్యాలయాల చుట్టూ రైతులు తిరగాల్సిన అవసరం లేదన్నారు. ఈ చట్టంపై రైతులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఆర్ఓఆర్ అప్డేషన్ చేసే అవకాశం లేదని, భూభారతిలో అప్డేట్ చేసే అవకాశం ఉందని, మొఖా మీద ఉన్న రైతు తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే సవరణ చేసే అవకాశం ఉందన్నారు. అలాగే సక్సెసన్ విషయంలో సైతం ధరణిలో ఆప్డేషన్కు అవకాశం లేదని, భూభారతిలో చేసుకోవచ్చని చెప్పారు. సక్సేషన్, మ్యుటేషన్ కోసం దరఖాస్తుదారులు దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో తహసిల్దారు విచారణ చేసి మ్యుటేషన్ చేయాలని, లేకపోతే 31వ రోజు ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ అవుతుందన్నారు. ఎంజాయ్‌మెంట్ సర్వే విషయంలో గతంలో అసైన్మెంట్ భూములు వివాదాలు ఉంటే వాటికి ధరణిలో పరిష్కారం లేదని, భూ భారతిలో టైటిల్ ఫ్లో చార్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, దాని ద్వారా మళ్ళీ సవరణ చేసి అసలు హక్కుదారులకు పట్టా ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. భూభారతి చట్టం ద్వారా 90శాతం రైతుల భూసమస్యలను పరిష్కారం ఇక్కడే జరుగుతుందని, కేవలం 10 శాతం మాత్రం ఆర్డిఓ కలెక్టర్ స్థాయిలో ఉంటాయని చెప్పా రు. మొఖా మీద ఉన్నవారి పేర్లను ఖాతాలో ఎక్కించడం జరుగుతుందని, అన్ సైన్డ్ ఖాతాలు ఉంటే గతంలో ఉన్న పట్టా పాస్బుక్ ఆధారంగా చేయడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. రైతులు భూభారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాము అధికా రంలోకి వచ్చిన తర్వాత ధరణిస్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరి గిందని ఈ చట్టంలోని వికేంద్రీకరణ పరిపాలన వల్ల రైతులకు వారి భూసమస్యలను పరిష్కరించుకునేందుకు ఎంతో వేసులు బాటు కలిగిందని అన్నారు.

రుణమాఫీ, ఎస్సీ వర్గీకరణ, కుల గణన, సన్న బియ్యం పంపిణీ వంటి ప్రతి ష్టాత్మక పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని, వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రామ దేవి, తహసీల్దార్ తులసిరాం, మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్,జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ట్రాన్స్పోర్ట్ కమిటీ జిల్లా సభ్యులు మల్లారెడ్డి, వ్యవసాయ అధికారి రామ్ ప్రసాద్, మండల సీనియర్ నాయకులు మన్ కిషన్ , మండల ఎస్సీ సెల్ సేవా లాల్ నాయక్, మల్లారెడ్డి భూంరెడ్డి,.పాపయ్య. సంగమేశ్వర. సర్దార్. రాజగౌడ్ కిషోర్.మజర్. రాజేష్, లక్ష్మన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



ధ్వంసమైన దుకాణాలు

## జగదేవ్‌పూర్‌లో గాలివాన బీభత్సం

### దెబ్బతిన్న పంటలు

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** మండలకేంద్రంతో పాటు గొల్ల పల్లి, మునిగడప తదితర గ్రామాల్లో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వచ్చిన గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు మెరుపులతో కూడిన గాలివాన, వడగండ్లతో వర్షం కురవడంతో పంటలు దెబ్బతిన్నాయి. గ్రామాల్లో అక్కడక్కడ చెట్లు విరిగిపడగా, జగదేవ్‌పూర్ మండలకేంద్రంలో రోడ్డు పక్కన రేకులతో షెడ్డు వేసి చెప్పులు, బట్టల వ్యాపారం చేసుకున్నంటున్న వారి రేకుల షెడ్డు ఈదురు గాలులతో ధ్వంసమై సామాగ్రి పూర్తిగా దెబ్బ తిన్నాయి. అదేవిధంగా దశరథ ఉప్పలమ్మ దంపతులు గత నాలుగు సంవత్సరాలుగా జగదేవ్‌పూర్‌లో స్క్రాబ్ వ్యాపారం నిర్వహిస్తూ రేకుల షెడ్డులో నివాసం ఉంటుండగా ఈదురుగాలులకు పైకప్పు లేచిపోయి వంట సామాగ్రి తో పాటు బట్టలు, బియ్యం, నిత్యావసర సరుకులు అన్నీ తడిసి ముద్దయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

## భూభారతితో భూ వివాదాలు లేని రాష్ట్రంగా తెలంగాణ

### -రాష్ట్ర సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి-2025 చట్టంతో రాష్ట్రంలో భూ వివాదాలు లేని రాష్ట్రంగా తయారు అవుతుందని రాష్ట్ర సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్‌వి కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సులో ముందుగా సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. భూభారతి చట్టంపై అధికారులు, నాయకులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, అదనపు కలెక్టర్ మాధురి, ఆర్‌డిఓ రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




భూభారతి సదస్సులో సిఎం సందేశాన్ని వినిపిస్తున్న చైర్మన్ గిరిధర్‌రెడ్డి

## ఇళ్లు లేని పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

### రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండి విపి గౌతమ్

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

ఇళ్లు లేని పేదలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండి విపి గౌతమ్ అన్నారు.సోమవారం రోజున సిద్దిపేట ఐడిఓసిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతి పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించే 5లక్షలతో ఇండ్లు ఏవిధంగా సాధ్యమౌతాయన్న సందేహాన్ని తీర్చి లబ్దిదారులలో నమ్మకాన్ని కల్పించేలా అన్ని గ్రామాలలో మోడల్ ఇండ్లను నిర్మించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన ధరఖాస్తులలో స్థలం ఉండి ఇండ్లు కట్టుకునే స్తోమత లేని పేదలను మాత్రమే లబ్దిదారుల లిస్టులో చేర్చాలన్నారు.ఆర్థిక సహాయం కోరుకునే వారికి మహిళా సంఘాల ద్వార రుణాలు ఇప్పించేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.పూర్తవుతున్న ఇండ్ల నిర్మాణ పనులను కార్యదర్శి పోర్టల్‌లో నమోదు చేయవల్సిన అవసరం లేకుండా ఇందిరమ్మ ఇల్లు అనే యాప్ ద్వార లబ్దిదారుడే ఎప్పటికప్పుడు ఫోటోలు అప్‌లోడ్ చేసే విధంగా అవకాశం కల్పించినట్లు వివరించారు.గ్రామాలలో ఇందిరమ్మ కమిటీలు గుర్తించిన వారిని సైతం అదికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.

**అర్హులకు అన్యాయం జరగవద్దు : కలెక్టర్**

ఇందిమ్మ ఇండ్ల విషయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు అన్యాయం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు.

ప్రతీ అధికారి ఇళ్ల నిర్మాణం ప్రక్రియను, నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ త్వరగా ఇండ్లు పూర్తయేలా చొరవ తీసు కోవాలన్నారు. ఇండ్ల నిర్మాణం కచ్చితంగా ప్రభుత్వం సూచించిన విధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశం అనంతరం గృహనిర్మాణ సంస్థ ఎండి గౌతమ్ కుకునూర్‌పల్లి, సిద్దిపేట రూరల్, కోహెడ మండలాలలో పర్యటించి ఇందిర్మ ఇండ్ల లబ్దిదారులు ఉంటున్న ఇండ్లను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్,హౌసింగ్ పిడి దామోదర్‌రావు, డిఆర్‌డివో జగదేవ్ ఆర్య,ఆర్డీవోలు చంద్రకళ, రాం మూర్తితో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న విపి గౌతమ్



ఏఎంసి చైర్మన్, వైస్ చైర్మన్‌లు బాధ్యతలు స్వీకరిస్తున్న దృశ్యం

## వంటిమామిడి ఎంఎంసి చైర్మన్‌గా విజయ

### -బాధ్యతలు చేపట్టిన నూతన పాలకవర్గం

**ములుగు, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** వంటిమామిడి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా బాగనోల్ల విజయ, వైస్ చైర్మన్‌గా కొడిత్యాల ప్రభాకర్‌గుప్తలు నియమితులయ్యారు. సోమవారం నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌లు పాలకవర్గ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీచేయగా సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. వంటి మామిడి మార్కెట్ అభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామని, మార్కెట్ వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లు కుతాడి శ్రీనివాస్, ఆదాసు మహేందర్, ఏనుగు నర్సింహారెడ్డి, సిలేంద్రి మల్లేష్, కొమ్మిడి నర్సారెడ్డి, బుక్యా శ్రీనివాస్, గుండ శంకర్, ర్యాకం యాదగిరి, పత్తి నర్సింలు, పుల్లబోయిన బిక్షపతి, సయ్యద్ వాజీద్, కుంట శశికాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, అయిలేష్‌యాదవ్, మణిపవన్‌రెడ్డి, కిరణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిమ్మ రంగారెడ్డి పాల్గొన్నారు.

## ఎంఎంసి డైరెక్టర్లుగా ముగ్గురికి అవకాశం

**మర్కుక్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** వంటిమామిడి మార్కెట్ కమిటీ నూతన డైరెక్టర్లుగా మర్కుక్ మండలం దామరకుంట గ్రామానికి చెందిన పత్తి నర్సింలు, చేబర్తికి చెందిన ర్యాకం యాదగిరి, మర్కుక్‌కు చెందిన శంకర్‌గుప్తలకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో మార్కెట్ డైరెక్టర్లుగా నియమించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కనకయ్యగౌడ్, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉండి మార్కెట్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

## కొండపాక ఎంఎంసి కమిటీ బాధ్యతల స్వీకారం



ఎఎంసి చైర్మన్, వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న దృశ్యం

**కొండపాక, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఉమ్మడి కొండపాక మండల వ్యవసాయ మార్కెట్ కమిటీని ప్రభుత్వం ఎట్టకేలకు నియమించింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మెదినిపూర్ గ్రామానికి చెందిన విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బందారం గ్రామానికి చెందిన బట్ట పర్శ రాములును నియమిసు ఉత్తర్వులు జారీ చేయగా సోమవారం వారు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పదవి బాధ్యతలను చేపట్టారు. చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు మారో 16 మందిని డైరెక్టర్‌లుగా నియమించింది. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ పదవులు ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎఎంసిని నియమించింది. కొండపాక మండలానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ మంజూరైనప్పటి నుండి సక్రమంగా జరిగితే ఇప్పటి దాదాపు 5 కమిటిల పదవి కాలం పూర్తి అయ్యేది, కాని బిఆర్ఎస్ పార్టీలోని నాయకుల మధ్య సరైన సయోధ్యలేక, పార్టీ అధిష్టానం సరిగా పట్టించుకోకపోవడంవల్ల కమిటీ నియమకం జరగలేదు. బిఆర్ఎస్ పార్టీకి పని చేసిన ఎంతో మంది కార్యకర్తలు మార్కెట్ కమిటీలోనైనా పదవుల అవకాశం దక్కుతుందని ఆశించి భంగపడ్డారు.

## సిర్గాపూర్‌లో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు

**సిర్గాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఏర్పాటు జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల రైతులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగం స్వప్న, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ వేదికపై దామరకుంట విద్యార్థిని

**మర్కుక్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ అవార్డ్స్ వారు నిర్వహించిన పోటీల్లో మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని లింగా వైష్ణవి పాల్గొన్నారు. ఈనెల 20న పంజాబ్ అమృత్‌సర్‌లోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీలో అంతర్జాతీయంగా రెండవ అతిపెద్ద అవార్డు సంస్థ అయిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ అవార్డ్స్ వారు నిర్వహించిన పోటీల్లో 12 దేశాలకు చెందిన అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులు పాల్గొన్న వేదికలో దామరకుంట విద్యార్థిని వైష్ణవి పాల్గొన్నారు. దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు వై.చిన్నబ్రహ్మయ్య మార్గదర్శకత్వంలో విద్యార్థిని వైష్ణవి ఈ పోటీల్లో పాల్గొని ఒక నిమిషం 59 సెకండ్ల సమయంలో రసాయన శాస్త్రంలోని నూతన ఆవర్తన పట్టిక క్రమాంకములో ఏర్పాటుచేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ అవార్డ్స్‌లో స్థానం సొంతం చేసుకోగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ అవార్డ్స్ సీఈఓ పంకజ్ వేగ్ చేతులమీదుగా ట్రోఫీని, బహుమతిని అందుకుంది. ఇదిలా వుండగా విద్యార్థిని వైష్ణవిని ప్రోత్సహిస్తూ పోటీల్లో పాల్గొనడానికి పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయిని ముదిగొండ మణిమాల విశ్వప్రసాద్ రూ.15వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ వెంకటరాములు, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని వైష్ణవిని, గైడ్ టీచర్ చిన్నబ్రహ్మయ్యను అభినందించారు.




ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ అవార్డ్స్ సీఈఓ చేతులమీదుగా అవార్డ్ అందుకుంటున్న విద్యార్థిని వైష్ణవి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## ఎల్లుపేటలో పిహెచ్‌సిని ప్రారంభించిన కలెక్టర్

**టేక్మాల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాధా నరసింహ ఎల్లుపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించేందుకుగాను స్థల సేకరణ జరిగిందన్నారు. తాత్కాలికంగా ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు గాను అద్దె భవనంలో ఆసుపత్రిని ఏర్పాటు చేసి కలెక్టర్‌చే ప్రారంభించారు. ఈసేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని చెప్పారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్.జిల్లా వైద్యాధికారి శ్రీరామ్. టేక్మాల్ వైద్యాధికారి హర్షిత, మండల పార్టీ అధ్యక్షులు నిమ్మ రమేష్,జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ట్రాన్స్పోర్ట్ కమిటీ జిల్లా సభ్యులు మల్లారెడ్డి, మండల సీనియర్ నాయకులు మన్ కిషన్ , మండల ఎస్సీ సెల్ సేవా లాల్ నాయక్, మల్లారెడ్డి భూమి రె సిబ్బంది ఉన్నారు.

### కలెక్టర్ సమావేశంలో కునుకు తీసిన ఎంపిడివో...

**టేక్మాల్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** టేక్మాల్‌లో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతుండగా టేక్మాల్ ఎంపీడీవో విఠల్ ఓ కునుకు తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కునుకు తీయడం పట్ల నాయకులు అధికారులు ఇబ్బంది పడ్డారు. తాగిన మత్తులో స్టేజి పైకి తూలుతూ ఎక్కి కుర్చీపై కూర్చున్నారు. విధులు పట్ల నిర్లక్ష్యన్ని చూపుతారంటూ నాయకులు అనుకోవడం వినబడింది. దీంతో తోటి ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు.

## రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**హవేలీఘనపూర్, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** మండల పరిధి కుచానపల్లి, గజిరెడ్డిపల్లి బూరుగుపల్లి కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సోమవారం పరిశీలించారు. హవేలీఘన్పూర్ మండలంలో పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో తీసుకురావడం జరిగిందని తెలిపారు. రేజిస్టర్లు పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హవేలీ ఘన్పూర్ మండలంలో కుచాన్పల్లి, ఐకెపి కొనుగోలు కేంద్రం, బూరుగుపల్లి, గజిరెడ్డిపల్లి కొనుగోలు కేంద్రాలను పరిశీలన చేయగా సమర్థవంతంగా కొనుగోలు జరుగుతున్నట్లు , నిర్వాహకుల ద్వారా తెలుసుకొని ధాన్యం కొనుగోలు లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని జాగ్రత్తగా తడవకుండా కింద, పైన టార్పలిన్ కప్పాలని నిర్వాహకులకు సూచించారు. లారీల కొరత లేకుండా చూసుకోవాలనిఆదేశించారు. .కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడారు. రైస్ మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకోవాలని,ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## కొల్చారం పిహెచ్‌సిని సందర్శించిన రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్ నాయక్



మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్ నాయక్

**కొల్చారం, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రవీందర్‌నాయక్ సోమవారం మండల కేంద్రం కొల్చారం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. అనంతరం అంసాన్‌పల్లి ఆయుష్మాన్ భారత్ సెంటర్‌ను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా మండల వైద్యాదికారి రమేష్ కు ఆరోగ్య సిబ్బందికి సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని గర్భిణీలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచనలు, సలహాలు అందించారు. బీపీ షుగర్ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి రోగులకు మందులు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, కొల్చారం వైద్యాధికారులు రమేష్‌నాయక్, నర్సాపూర్ డివిజన్ అధికారిని సృజనా , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్‌ఓ, మదన్మోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### బుడగ జంగాల భూములు వారికే ఇవ్వాలి

**మెదక్, అర్బన్, ఏప్రిల్ 21 ప్రభాతవార్త:** బుడగ జంగాల కు ప్రభుత్వం కేటాయించిన భూములను బుడగజంగాలకే కేటాయించిన భూములను బుడగజంగాలకే ఇవ్వాలని అడిషనల్ కలెక్టర్ గారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం .రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ మాట్లాడుతూ బుడగ జంగాల కు ప్రభుత్వం కేటాయించిన భూములను బుడగజంగాలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు .రాష్ట్రంలో పేదల భూములు పెత్తందారులు కబ్జాదారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనేక చోట్ల కబ్జాలు చేస్తూ .పేదలపై దాడులు చేస్తున్నారని అన్నారు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం లో పిఓపి చట్టం వాడుకొని పేదల భూములలో పెత్తందారులు పాలకులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాలు చేశారని అన్నారు. దానికి నిదర్శనం సాక్ష్యం మెదక్ జిల్లాలోని మెదక్ మండలం రాయినిపల్లి శివారులోని సర్వేనెంబర్ 226..227..228..229.లో నీ భూమి అని గుర్తు చేశారు ..గల భూమిలో గతంలో 1980లో బుడగ జంగాలకు ప్రభుత్వం భూములు పంపిణీ చేసి పట్టాలు ఇచ్చింది ఇళ్లస్థలాలు ఇచ్చింది గతంలో అక్కడ ప్రాంతంలో మంచినీళ్లు కరెంటు సౌకర్యం లేక బుడగ జంగాల వారు వలసలు వెళ్లారన్నారు.

### వచ్చే విద్యాసంవత్సరానికి కెజిబివి పాఠశాల భవనం సిద్ధం

**కోట్‌పల్లి, ఏప్రిల్ 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కరీంపూర్‌గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కెజిబివి పాఠశాల భవనం నిర్మాణ పనులను సోమవారం మండల విద్యా ధికారి చంద్రప్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 2025-26 నాటికి భవన నిర్మాణ పనులు పూర్తిచేయాలని ఇంజనీర్ రామ్ కిషోర్‌కు పూచించారు. కెజిబివి భవనం 5ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్నార న్నారు. కెజిబివి భవనంలో 5తరగతిగదులు 3ల్యాబ్స్, 1లైబ్రెరీ, 8డార్మెటరీ లు, 1స్టడీహాల్, 1కిచెన్, 1డైనింగ్‌హాల్, 1ఉపాధ్యాయులగది, 1ప్రిన్సిపాల్ గది, 1నర్సింగ్‌రూమ్, 1స్టోర్‌రూమ్‌లతో కలిపి మొత్తం 24గదులతో 2025- 26, విద్యా సంవత్సరానికి అందించేందుకు పనులు కొనసాగిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ రామ్ కిషోర్ తదితరులు ఉన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికే భూభారతి చట్టం

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** భూభారతి చట్టంతో భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం చిలిపిచెడ్‌లోని రైతు వేదికలో భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరవ్వగా జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసిని రెడ్డి, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సింధుజ, ఎంపీడీవో ఆనంద్, ఏడిఏ పద్మ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ముందుగా సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సందేశాలు రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యుల సందేశాలను వినిపించారు. అంతేగాక తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో భూభారతిపై కళా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ భూ భారతి చట్టం 2025 లో ప్రతి రైతుకు భూ సమస్యలు ఉన్నచో న్యాయం జరుగుతుందన్నారు. భూభారతిలో భూ సమస్యల పరిష్కారానికి నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద తీసుకోవడం జరిగిందని తెలిపారు. నెలాఖరు వరకు ఈ పైలెట్ ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. అయితే జూన్ నుండి పైలెట్ ప్రాజెక్టు మండలాల్లో రైతుల వ్యవసాయ భూముల సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయన్నారు.తహసీల్దార్ స్థాయి అధికారులే ప్రతి గ్రామానికి వచ్చి భూ సమస్యల దరఖాస్తులు తీసుకుంటారని ఈ మేరకు రైతులు ఒక్క రూపాయి కూడా ఇవ్వనవసరం లేదన్నారు. ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉన్నట్లే భూధార్ కార్డు కూడా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు గతంలో భూములు కొన్న అమ్మిన మ్యాపింగ్ లేదని ఇకపై భూమి రిజిస్ట్రేషన్ సమయంలోనే సర్వే మ్యాప్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేలా చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ధరణిలో సాదా బైనామాలకు అవకాశం లేదని, ప్రభుత్వం వద్దకే ప్రజలు వచ్చేవారని కాగా భూభారతి చట్టంలో అధికారులు వచ్చి ప్రజలకు పూర్తి న్యాయం చేసేలా భూభారతి లో రూపొందించడం జరిగిందని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి భూమిపై ఉన్న వారికే పట్టాలు, సాగు చేస్తున్నవారికి పట్టాలు ఇస్తారని తెలిపారు. అదేవిధంగా భూ భారతి చట్టంపై విస్తృతంగా ప్రచారం చేస్తామని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ వెల్లడించారు. అనంతరం జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ధరణి స్థానంలో భూభారతి చట్టం తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు ప్రజలు పాల్గొన్నారు.

## పిట్లంబేస్‌లో ఆంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్టాపన

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** పట్టణంలోని పిట్లంబేస్‌లోగల మహా వీర హనుమాన్ ఆలయంలో ఆంజనేయ స్వామి సమేత నవగ్రహ, శిఖరయంత్ర-విగ్రహ స్థిర పునఃప్రతిష్ట శ్రీదేశాయిపేట లింగమూర్తి శర్మ పురోహితులు గారి ప్రత్యక్ష నిర్వహణలో 19వ తేది శనివారం రోజున జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ గోదాల సాయి మాట్లాడుతూ 19వ తేదీ శనివారం రోజు గణపతి పూజా, పుణ్యావాచనము, పంచగవ్యప్రాశన, ఋత్విగ్వరణము, గోపూజ, యాగశాల ప్రవేశము, మంటప స్థాపన, విగ్రహాల ఊరేగింపు, దేవతాహ్వానము, జలాధివాసము, ప్రదోశకాల పూజ, రాజోపచరాలు, తీర్థప్రసాద వితరణము, 20వ తేదీన ఆదివారం ఆవాహిత దేవతా, మూల మంత్రాల హవనము, మహాసపనము అధివాసాంగ హోమాలు, ప్రదోశకాల పూజ, రాజోపచారాలు, ధాన్య, ఫల, పుష్ప, శయ్యాధి వాసాలు, మంగళహారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణము, 21 వతేది సోమవారం రోజు ఆవాహిత దేవతాపూజ, ప్రతిష్టాంగ హోమాలు గర్త సంస్కారము, యంత్ర-విగ్రహ ప్రతిష్ట అనంతరం, బలిహరణం, మహా పుర్ణాహుతి, నేత్రోన్మీలనం, దేవతాదర్శనం, కలశ ఉద్వాసన, వేద ఆశీర్వచనం, ఋత్విక్ సన్మానము కార్యక్రమములు జరుపబడును. ఈకార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసారు. మాజీ కౌన్సిలర్ గోదల కిష్టయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ రాగి అశోక్, కొండా శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, గుడూరు ఆంజనేయులు, హరక్కర్ మహిపాల్, భక్తులు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విజ్ఞానానికి వేదిక గ్రంథాలయం....

**కొత్తూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** యువత భవిష్యత్తుకు వెలుగు చూపేది గ్రంథాలయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీలో రూ.75లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. గ్రంథాలయాన్ని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మెన్ మధు, స్థానిక కౌన్సిలర్ అనితశ్రీనివాస్‌గౌడ్, సాన్థిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థుల భవిష్యత్తు, యువతలో మార్పు కేవలం మంచి పుస్తకాల్లోనే ఉందని, ఇలాంటి గ్రంథాలయాలు వారి జీవితాల్లో వెలుగులు నింపుతాయన్నారు. చదువులో ఆసక్తి పెరిగేలా, విజ్ఞానాన్ని విస్తరించుకునేలా విద్యార్థులు ఈ గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. స్థానిక ప్రజలు కూడా ఈ కొత్త గ్రంథాలయాన్ని ఎంతో హర్షంగా స్వాగతించారు. ఇది యువతలో చదువుపట్ల ఆసక్తిని పెంచడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మెన్ డోలి రవీందర్, మాజీ ఎంపీపీ వేణుగోపాల్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్‌ముదిరాజ్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బండారి భరత్‌గౌడ్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, షాద్‌నగర్ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు కర్రోళ్ల సురేందర్, మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపీటీసీలు కుమారస్వామిగౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మె సత్తయ్య, ఆంజనేయులుగౌడ్, బ్యాగరి యాదయ్య, ఇందూరి శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నందిగామ మండల అధ్యక్షుడు జంగా నరసింహ, నవీన్‌చారి, శివగౌడ్, జగన్‌గౌడ్, గోవింద్‌నాయక్, చిలకమర్రి నరసింహ, చింతసాయితేజేశ్వర్, పాశం కృష్ణ, యాదయ్య, తుప్పర బాల్‌రాజ్, శ్రీనునాయక్, నాయకులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన

**జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 21, (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగ చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సోమవారం మండల కేంద్రంలోని రైతువేదికలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు జగదీశ్వర్‌లు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో గల ఇందిరమ్మ ఇళ్లకు సంబందించి 500మంది పేర్లు మొదటి విడతగ వచ్చినట్లు ఆయన పెర్కొన్నారు. ప్రభుత్వ నిభందనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు జగదీశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు

## ఎమ్మెల్యే రోహిత్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం : చౌదరి సుప్రభాతరావు

**రామాయంపేట మున్సిపాలిటీ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** మెదక్ ఎమెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పైన అనుచిత వాఖ్యలు చేసినా, సోషల్ మీడియా వాట్సాప్ గ్రూప్‌లలో అనుచిత పోస్టులు పెట్టినా... ఇకపై ఊరుకోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు అన్నారు. సోమవారం రామాయంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కొందరు కార్యకర్తలతో పాటు మరికొందరు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై ఫేస్బుక్‌తో పాటు సోషల్ మీడియాలో అణుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టడం జరుగుతుందన్నారు. ఈవిషయంలో పోలీస్ స్టేషన్‌లో సైతం తాము ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఇష్టం వచ్చినట్లు ఫేస్బుక్, వాట్సాప్‌లో పోస్టులు పెట్టినా ఇకపై ఊరుకోబోమని స్పష్టం చేశారు. గతంలో తమపై కూడా ఇలాంటి వ్యాఖ్యలు చేసిన సహించామని, అభివృద్ధికి సహకరిస్తన్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే హనుమంతరావుపై ఇష్టం వచ్చినట్లు పోస్టులు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేయడంపై తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అది సమంజసం కాదని అన్నారు. పదవిలో ఉన్నా, లేకున్నా నిరంతరం మెదక్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న వారిపట్ల ఇలాంటి పోస్టులు పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేపైన ఎవరైనా సరే అనవసరంగా వ్యాఖ్యలు చేసి పోస్టులు పెడితే వారిని ఎప్పటికీ వదిలిపెట్టమని...ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, సరాఫ్ యాదగిరి, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లాడి వెంకటేష్, దేమె యాదగిరి, చింతల యాదగిరి, దాకి స్వామి, బొర్ర అనిల్‌కుమార్, కుమార్ సాగర్, దండు శివకుమార్, మేఘమ్మగారి శంకరయ్య, చిలుక స్వామి, బొట్ల బాబు, సుందర్‌సింగ్, చింతల స్వామి, సుంకోజు దామోదర్ చారి, చిలుక గంగాధర్, జయరాజ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

**జిల్లేడు చౌదరిగూడ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఉపాధిహామీ కూలీలు, సిబ్బందికి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య అన్నారు. జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రం ఆర్య సమాజ్ ఆవరణలో తెలంగాణ వ్యవసాయ కార్మికసంఘం జిల్లేడు చౌదరి గూడా మండల మహాసభ వి.భీమయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ఎండలో పనులు చేస్తుంటే ప్రభుత్వానికి అధికారులకు కనికరం లేకుండా వ్యవహరించడం సరైనది కాదు అని ఆయన మండిపడ్డారు. దేశవ్యాప్తంగా 100 కోట్ల మంది ఉపాధి కూలీలకు రెండు లక్షల 86 వేల కోట్లు అవసరం ఉంటే కేవలం 86 వేల కోట్లు మాత్రం కేటాయించి చేతులు దులుపుకున్నారని అన్నారు. పనుల దగ్గర కనీస వసతులైన మంచి నీళ్లు, నీడ కోసం టెంటు, వైద్యకిట్టు, గడ్డపార గంపలు లాంటివి ఎలాంటివి ఏర్పాటు చేయకుండా ఉపాధికూలీలతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం నూతనకమిటీని ఎన్నుకోవడం జరిగింది గౌరవాధ్యక్షులుగా వి.భీమయ్య అధ్యక్షులుగా, కె.లింగం ఉపాధ్యక్షులుగా కె.రామచెంద్రి యాదమ్మ కార్యదర్శిగా ఎం.కృష్ణ, సహాయ కార్యదర్శిగా కృష్ణయ్య, సురేష్ కోశాధికారిగా, పి.బాలులతోపాటు మరో ఏడుమందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం సమస్యలపై ఎంపిడివో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.



మాట్లాడుతున్న ఎంపి, మాజీ ఎంపి, జిల్లా అధ్యక్షులు

## వక్ఫ్ సవరణ చట్టంతో పేద ముస్లింలకు ప్రయోజనం

### -ఎంపి, మాజీ ఎంపి, చైర్మన్

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** వక్ఫ్ సవరణ చట్టంపై పేద ముస్లింలతో అపోహాలు సృష్టిస్తూ అల్లర్లు రేపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎంపి రఘునందన్‌రావు, మాజీ ఎంపి బిబి పాటిల్, బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మండిపడ్డారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపి, మాజీ ఎంపి, జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వక్ఫ్ పేరిట భుములను అక్రమంగా తీసుకోవడం ఆగిపోతుందన్నారు. జహీరా బాద్ నియోజకవర్గంలో 12,892 ఎకాలు వక్ఫ్ భూములుగా నమోదు చేయడంతో వేల మంది రైతులు తమ హక్కులను కోల్పోయారని గుర్తు చేశారు. మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్, రాయికోడ్ మండలాల్లో పెద్ద ఎత్తున భూములు వక్ఫ్ జాబితాలో చేరాయని ఆరోపించారు. కొండాపూర్ మండలం సైదాపూర్‌లో 197 ఎకరాలు వక్ఫ్ జాబితాలో చేరడంతో 2వందల మంది రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రంలో పాతబస్తీ వక్ఫ్ ఆస్తులపై సిఎం రేవంత్‌రెడ్డి బహిరంగంగా వివరాలు వెల్లడించాలని, ముతావలీలు ఎవరిపేర్లపై లీజులకు ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో వక్ఫ్ భుములు ఆక్రమణకు గురవుతున్నా అసలు లబ్దిదారులైన పేద ముస్లింలకు ఉపయోగం లేకుండా పోతోందని, తప్పుడ ప్రచారాలను నమ్మొద్దని, ప్రజలు చట్టంపైఅవగాన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉండటాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని గుర్తు చేశారు.

## ముత్తంగిలో మంచినీటి సమస్యను తీర్చండి

### జిల్లా కేంద్రంలోని గ్రీవెన్స్ లో గ్రామస్తుల మొర

**పటాన్‌చెరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపాలిటీలో కలిసినప్పటి నుంచి తీవ్ర సమస్యలతో ముత్తంగి గ్రామము కొట్టు మిట్టాడుతుందని బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రామకృష్ణ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మేరాజ్ ఖాన్ వాపోయారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గ్రీవెన్స్ లో గ్రామస్తులు విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ... గత 8 నెలల క్రితం తెల్లాపూర్ మున్సిపాలిటీలో ముత్తంగి గ్రామానికి లీనం చేసినప్పటి నుంచి నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఫలితం శూన్యమన్నారు. సుమారు 25 వేల మంది జనాభా ఉన్న ముత్తంగి గ్రామానికి 45 రోజులుగా నీటి చుక్క రావడం లేదన్నారు. జాతీయ రహదారి విస్తీర్ణ పనులు జరుగుతుండడంతో మంజీరా పైపులైన్లు, మిషన్ భగీరథ గ్రిడ్ పైప్ పైపులను పగిలిపోవడంతో నీళ్లు రాక గత 45 రోజులుగా గ్రామస్తులు ఎదురుచూస్తున్నారన్నారు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినప్పటికీ వాళ్ళ పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సాయి ప్రసాద్, సాయిరాం గౌడ్, సురేష్ ముదిరాజ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు అంత్యోదయ రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** వికలాంగులకు అంత్యోదయ రేషన్‌కార్డ్స్, స్థలంఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లతోపాటు మరో 28 డిమాండ్ లపై వికలాంగుల హక్కుల జాతీయ వేదిక మెదక్ జిల్లా కమిటీ ప్రతినిధి బృందం ఈరోజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య, జిల్లా ఉపాధ్యక్షులు టి. యాదగిరి, ఆర్. కిష్టయ్య, జిల్లా సహాయ కార్యదర్శి టి. కిష్టయ్య మెదక్ పట్టణ కన్వీనర్ వి. శ్రీదేవి, కో కన్వీనర్స్ జి.వెంకట్, మున్నా, జిల్లా నాయకులు పెంటోజీ ఈ రోజు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ యం. నగేష్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. అడివయ్య మాట్లాడుతూ జిల్లాలో 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం గుర్తించిన 21 రకాల వైకల్యాల ప్రకారం సుమారు 30,000 మంది వికలాంగులున్నారు. కొత్త పెన్షన్ మంజూరు కాకపోవడం వలన వికలాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఈ మధ్యకాలంలో వికలాంగులపై వేధింపులు, దాడులు పెరిగిపోతున్నవి. జిల్లాలో ఉన్న పరిశ్రమల సీఎస్ఆర్ నిధుల ద్వారా వికలాంగులకు సహాయ పరికరాలు పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలి. జిల్లాలో వికలాంగులు ఎదుర్కొంటున్న డిమాండ్‌లను పరిష్కారం కోసం ఏప్రిల్ 30 లోపు స్పందించకుంటే మే 2, 3 తేదీల్లో 24 గంటల మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

### వికలాంగుల సమస్యల పరిష్కారానికి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తాం : అసిస్టెంట్ కలెక్టర్ నగేష్

వికలాంగుల సమస్యలపై ఎన్‌పిఆర్‌డి ప్రతినిధి బృందం ఇచ్చిన 30 డిమాండ్లపై ఏప్రిల్ 30 లోపు జిల్లా అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని మెదక్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ నగేష్ హామీ ఇచ్చారు. జిల్లాలో వికలాంగులు ఎదురుకుంటున్న న్యాయమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఎన్‌పిఆర్‌డి కృషి చేస్తుందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## మల్లన్న దేవాలయం నిర్మాణానికి సహకరించండి

### -తహసీల్దార్‌కు విన్నవించుకున్న యాదవ సంఘం సభ్యులు

**శంషాబాద్. ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని పెద్ద షాపూర్ వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న మల్లన్న దేవాలయ నిర్మాణానికి కొందరు ఆటంకం కల్పిస్తున్నారని వారిపై తగిన చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యాదవ సంఘం సభ్యులు శంషాబాద్ తహసిల్దార్ ను కోరారు. యాదవ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో అసెంషాబాద్ తహసిల్దార్ రవీందర్ దత్‌ను సోమవారం కలసి వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా ఉంటూ దేవాలయాన్ని నిర్మిస్తున్నారని కాగా గ్రామానికి చెందిన ఒకరిద్దరు వ్యక్తులు తరచుగా పనులను ఆటంకం కలిగిస్తూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. దేవాలయ నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై శంషాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని గ్రామస్తులు వివరించారు. తహసిల్దార్ జోక్యం చేసుకొని దేవాలయ నిర్మాణంలో ఆటంకాలు ఎదుర్కాకుండా సహకారం అందించాలని వారు కోరారు.

అందరికీ ఉపయోగపడే విధంగా మానసిక ప్రశాంతత పొందే విధంగా దేవాలయ నిర్మాణాన్ని రూపకల్పన చేయడం జరుగుతుందని దీనివలన గ్రామస్తులు అందరికీ ఎంతో మేలు జరుగుతుందని వారు వివరించారు.

## చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

### 3.5 తులాల బంగారం,15 తులాల వెండి స్వాధీనం

**పటాన్‌చెరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పటాన్‌చెరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పటాన్ చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన నిందితుడు శివరాత్రి దివాకర్ (23) పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో గత నెల రోజులలో ఇండ్లలో రెండు దొంగతనాలు చేసి తప్పించుకొని తిరుగుతున్నాడు. కాగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దొంగతనాలు జరిగిన ప్రాంతాలలో సీసీ ఫుటేజ్ లను పరిశీలించారు. సోమవారం పట్టణంలోని గౌతమ్ నగర్ లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీస్ స్టేషన్ కి తరలించి తమదైన శైలిలో విచారించగా తను చేసిన తుంగతనాలను ఒప్పుకున్నాడు. అతడిని అదుపులో తీసుకొని 3.5 తులాల బంగారం,15 తులాల వెండి స్వాధీనం. చేసుకున్నారు. గతంలోను సిద్దిపేట, గుమ్మడిదల, రామచంద్రాపురం, చందానగర్, దుండిగల్, బొల్లారం పలు ప్రాంతాల్లో దొంగతనం చేసి 20 కేసులలో జైలు శిక్ష అనుభవించిన పాత నేరస్తుడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును చేదించిన సీఐ వినాయక్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రాజు, ఎఎస్సై రాజు, బాలరాజు, సుకేష్ రెడ్డి, సాయి, అంజిలను డీఎస్పీ రవీందర్ రెడ్డి అభినందించారు.

# రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్నవారికి నష్టపరిహారం చెల్లించాలి

### సిపిఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు

**పటాన్‌చెరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** మియాపూర్ నుండి సంగారెడ్డి చౌరస్తా వరకు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు, ఇండ్లు కోల్పోతున్నవారికి నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ రంగారావుకు వినతిపత్రం అందజేశారు ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ మియ్యాపూర్ నుండి సంగారెడ్డి చౌరస్తా వరకు 1350 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో 700 కోట్లు రహదారి నిర్మాణానికి 650 కోట్ల రూపాయలు భూములు ఇండ్లు కోల్పోతున్న నిరాశ్రయులకు నష్టపరిహారం ఇవ్వడం కోసం నేషనల్ హైవే సంస్థ కేటాయించడం జరిగిందని చెప్పారు. కాని రుద్రారం. ముత్తంగి గ్రామాలలో జాతీయ రహదారి విస్తరణ పనులు జోరుగా జరుగుతున్న ఆ గ్రామాలలోని రైతుల భూములను పరిగణలోకి తీసుకోవడం లేదని, ఆ భూముల్లో పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. నేషనల్ హైవే వారు చేస్తున్న పనుల వలన రైతులు అనేక గందరగోళానికి గురవుతున్నారన్నారు. భూములు కోల్పోతున్నవారికి నష్టపరిహారం చెల్లించకపోవడంతో ఏ అధికారులను కలవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు ఏఈ, నేషనల్ హైవే విస్తరణ కాంట్రాక్టర్లతో అక్రమాలకు అవినీతికి పాల్పడుతూ గ్రామ రైతుల పొట్టలు కొట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు, గ్రామాల్లో ఇండ్లు టాక్స్ కట్టలేదని, కరెంట్ బిల్లు కట్టలేదని కుంటి సాకుతో పరిగణలోకి తీసుకోకుండా రైతులను, గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. గతంలో నష్టపరిహారము ఇచ్చామని చెబుతున్నప్పటికీ రుద్రారం గ్రామంలో ఒక్క రైతుకు మాత్రమే నష్టపరిహారం ఇచ్చి మిగతా రైతులకు నష్టపరిహారం ఇచ్చినామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. నష్టపరిహారం అడిగితే ఎలాంటి సమాధానం లేదని దాటవేస్తున్నారని, జిల్లా సంబంధిత అధికారులు రుద్రారం లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేసే విషయంలో దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లా అధికారులకు రాష్ట్ర నేషనల్ హైవే అథారిటీ అధికారులకు విన్నవించినప్పటికీ సమస్యను పరిష్కారం చేయడంలో ఆర్‌అండ్ బి ఏఈ అధికారులకు తప్పుడు సమాచారం పంపిస్తూ నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆరోపించారు. భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ఆర్ అండ్ బి ఏఈ బాధ్యత వహించవలసి ఉంటుందని, ఇప్పటికైనా నష్టపరిహారం సమస్యను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు డి.రవీందర్, డి రాములు,మహేందర్ రెడ్డి, డి విజయభాస్కర్, కుమ్మరి చంద్రయ్య, డి సురేందర్, సత్యనారాయణ, అంజిరెడ్డి, రాజి రెడ్డి , ప్రహ్లాద రెడ్డి, అనంత్ రెడ్డి, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.




తహసిల్దార్ రంగారావుకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు



సమ్మర్ క్యాంప్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ కృష్ణ

## సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎంఇవో

**గజ్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని ఈనెల 24 నుండి మే 15 వరకు నిర్వహించడం జరుగుతుందని పధా నోపాధ్యా యుడు మదునాల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సమ్మర్ క్యాంప్‌కు సంబంధించిన కరపత్రాలను ఎంఇవో కృషి చేతులమీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపుదిద్దుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి అంజయ్యయాదవ్, అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామ పెద్దలు మహేందర్‌రెడ్డి, భాస్కర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీశైలం, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, మోహన్‌రావు, రహేల, కల్పన, సాధన, రమ, విద్యార్థుల తల్లిదండ్రులు చంద్రమౌళి, శ్వేత పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లు ఆవిష్కరణ



సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**కోహెడ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ఈనెల 27న వరంగల్ (ఎల్కతుర్తి) లో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను రాష్ట్ర నాయకులు గవ్వ వంశీధర్‌రెడ్డి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వంశీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసి పొన్నాల లక్ష్మణ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ 24 వసంతాలు పూర్తిచేసుకుని 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి తిప్పారపు నాగరాజు, మాజీ సర్పంచ్‌లు తోట ఆంజనేయులు, లోనే మల్లేశం, నాయకులు యాద అశోక్, చింతలపల్లి తిరుపతిరెడ్డి, పిల్లి సంపత్, బబ్బురు శ్రీనివాస్‌గౌడ్, మంద సురేష్, రాజు, కుమారస్వామి, ఓవైస్, తిరుపతిరెడ్డి, తిప్పరవేణి భాస్కర్, గాలిపెల్లి బాబు, కొనవేని బాలకిషన్ సుధాకర్‌రెడ్డి, రమేష్, రాహుల్ ఉన్నారు.

## నకిలీ ఏజెంట్‌లపై చర్యలు తీసుకోవాలి

### గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి సంపత్



బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సంపత్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** గల్ఫ్ ఏజెంట్‌ల పేరిట సామాన్యులను మోసంచేస్తున్న నకిలీ ఏజెంట్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి గాజుల సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌కు చెందిన గల్ఫ్ కార్మికుడు చొప్పరి లింగయ్య భార్య రజితను ఆయన పరామర్శించారు. నెలరోజులు క్రితం దుబాయ్ వెళ్లిన లింగయ్య కాళ్లు,చేతులు వాపెక్కడంతో చేతిలో డబ్బు లేక వచ్చే పరిస్థితి లేక తన బాధను వీడియో రూపంలో సామాజిక మాధ్యమాలలో పెట్టాడు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తెలియడంతో అక్కడ ఉన్న ఎన్ఆర్ఐ సంక్షేమ సంఘం నాయకులను కార్మికుని వద్దకు పంపిచారని అక్కడికి వెళ్లిన వారు ఆయనకు కావాల్సిన చికిత్స అందించిన తర్వాత వారం రోజుల్లో స్వదేశానికి వచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. లింగయ్య స్వదేశానికి వచ్చిన తర్వాత వారికి ఉపాధి అవకాశంతో పాటు డబుల్ బెడ్‌రూం మంజూరు చేయాలని మంత్రిని కోరుతామన్నారు. గల్ఫ్ బాధితులకు తమ సంఘం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు.

## శ్రీసీతారామ ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఒకవైపు రామాలయంలో వైష్ణవ ఆచార్యుల, మరోవైపు శివాలయంలో శైవుల మంత్రోశ్చరణల మధ్య పోటాపోటీగా పూజా కార్యక్రమాలు జరిగాయి. రామాలయంలో సుదర్శనాచార్యులు వైదిక నిర్వహణలో ప్రధాన అర్చకులు బిటుకూరి శ్రీనివాసాచార్యులు, వరుణాచార్యులు వాసుదేవ పుణ్యాహవచనము, ధ్వజారోహణ, విశ్వక్సేనారాధన నిర్వహించగా శివాలయ అర్చకులు మఠం వీరభద్రయ్య ఆధ్వర్యంలో వీరశైవులు ఉమామహేశ్వరునికి రుద్రాభిషేకం, భేరిపూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్.సి. రాజమౌళి, బిఆర్ఎస్ నాయకులు కళ్యాణ్‌కార్ నర్సింగరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని స్వామివారలకు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు దేశపతి రాజశేఖరశర్మ, చాడ నందబాలశర్మ, ఆలయ ప్రధాన పూజారులు, ధర్మకర్తలు, వశిష్టులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

**కొండపాక, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, బుక్స్, గొడుగులు, వాటర్ బాటిల్స్, పరీక్ష ప్యాడ్‌లను ఒ సీడ్స్ కంపెని సిఎస్ఆర్ అధ్వర్యంలో సోమవారం బందారం పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. సీడ్స్ కంపెని ప్రతినిధి కొలుపుల అశోక్, స్థానిక నాయకులు ర్యాగల్ల దుర్గయ్య, కర్ణాకర్‌రెడ్డి, దుద్దెడ నరేష్, గంగధర్, బట్ట వెంకటేష్, సాయిబాబు, ఐలయ్య, పాఠశాల హెచ్ఎం గాడిపల్లి బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు నిమ్మ వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## అంగడికిష్టాపూర్‌లో మొక్కలు నాటిన ఎమ్మెల్సీ

**మర్కుక్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** మండలపరిధిలోని అంగడికిష్టాపూర్ లో మాజీ సర్పంచ్ లక్ష్మి రాములుగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాల రజతోత్సవంలో భాగంగా గ్రామంలో 25 మొక్కలు నాటినట్లు తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్‌కు మొక్కలు నాటడం, సంరక్షించడం ఎంతో ఇష్టమని, ఆయన హయాంలో లక్షల మొక్కలు నాటి హరిత తెలంగాణగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి రామచంద్రం, గర్నెపల్లి సతీష్, మాజీ ఎంపిటిసి గోలి నరేందర్, మాజీ సర్పంచ్‌లు భాస్కర్, ఉపసర్పంచ్ కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్, బాలకిషన్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, సురేష్‌గౌడ్, దుర్గాప్రసాద్, మహిపాల్‌రెడ్డి, రాజుగౌడ్, అనిల్ మొగిలి, కృష్ణ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి

# దారి ఖర్చులకు కూలీ పనిచేసిన బిఆర్ఎస్ నాయకులు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండలంలో నిర్వహించబోయే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ దారిఖర్చులకు సిద్దిపేట వర్తక వ్యాపారులు అందించిన సహకారం మరువలేనిదని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాజనర్సు, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండ సంపత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం సిద్దిపేట పట్టణంలోని నందిని శ్రీనివాస్ రైస్‌మిల్, సిద్దిపేట ట్రాన్స్‌పోర్టు, ఎస్ఆర్ సీడ్స్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి డైరీఫాంలో బిఆర్ఎస్ నాయకులు రజతోత్సవ సభకు దారి ఖర్చుల నిమిత్తం కూలీ పనులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ నిర్వహించే బహిరంగ సభకు సిద్దిపేట నుండి ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని, వచ్చేవారిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలు ఇచ్చి ఇచ్చిన హామీలు అమలుచేయడంలో విఫలమైందన్నారు. పదేళ్ల సిఎంగా ఉన్న కెసిఆర్ మళ్లీ సిఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

**రజతోత్సవ సభకు విరాళాలు అందించిన వ్యాపారస్తులు**



కూలీ పని చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

ఎల్కతుర్తిలో జరిగే సభకు సిద్దిపేట నుండి 30 వేలమంది నాయకులు, పార్టీ కార్యకర్తలతో బయలుదేరనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పని చేసిన బిఆర్ఎస్ నాయకులకు నందిని శ్రీనివాస్ రూ. 1 లక్ష, ఎస్ఆర్ సీడ్స్ కూర శ్రీనివాస్ రూ. 50 వేలు, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి రూ. 5 వేలు, సిద్దిపేట ట్రాన్స్‌పోర్టు వారు రూ. 2 వేల విరాళం అందించినట్లు చెప్పారు.



అక్రమంగా వెలిసిన బండ్లను తొలిగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

## ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** నర్సాపూర్ బస్టాండ్ మెయిన్ రోడ్ లోగల ఫుట్‌పాత్‌లపై రోడ్లపై ఉన్న డబ్బాలు బండ్లను తొలగించామని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు తెలిపారు. నర్సాపూర్ పట్టణంలోని బస్టాండ్ మెయిన్ రోడ్డులో ఫుట్ పాత్‌లపై వెలసిన వ్యాపారుల డబ్బాలను మున్సిపల్ సిబ్బందిచే తొలగించామని తెలిపారు. రోడ్లపై ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారుల డబ్బాలు పండ్ల బండ్లు ఉండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగించడం జరిగిందన్నారు. ఈ విషయమై ఆర్డీవో మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం నిర్వహించి రోడ్లపై వీటినితొలగించాలని తీర్మానించినట్లు చెప్పారు. ఈ తీర్మానం మేరకు అక్రమంగా వెలిసిన డబ్బాలను బండ్లను తొలగించామని ఆయన తెలిపారు. దుకాణా దారులు సైతం ఫుట్ పాత్‌లపై వస్తువులు పెడుతూ ఆటంకం కలిగిస్తున్నారని ఈ మేరకు మీ మీ దుకాణాల ముందర ఫుట్ పాత్‌లపై ఎటువంటి వస్తువులు పెట్టరాదని వారికి నోటీసులు ఇచ్చినట్టు తెలిపారు. అయినా ఫుట్ పాత్‌లపై దుకాణదారులు వస్తువులను పెడితే జరిమానాలు విధిస్తామని కమిషనర్ రామకృష్ణారావు తెలిపారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



పదవీ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుడు గోపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని తహసీల్దార్ మన్నన్ అన్నారు. సోమవారం చిన్న శంకరంపేట మండలం మదూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతల గోపాల్ పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసిన గోపాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ మాట్లాడుతూ 37 సంవత్సరాల పాటు మండల పరిధిలోని మాందాపూర్, కొర్విపల్లి, కామారం, దర్పల్లి, మదూర్ పాఠశాలలో విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్, ప్రధాన కార్యదర్శి పోచయ్య, ఎంపీడీవో దామోదర్, మండల విద్యాధికారులు బుచ్చయ్య నాయక్, పుష్పవేణి, సత్యనారాయణ, శివప్రసాద్, సంగయ్య, చదల భాస్కర్‌తో తదితరులు పాల్గొన్నారు.

## అంబలి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**సదాశివపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న తండ్రి చీల బస్వరాజ్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబలి కేంద్రం ఏర్పాటుతో ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బడగామ శ్రీశైలం, ఈశ్వర్, మల్లయ్యస్వామి, చందు, నాగు, ప్రవీణ్, బిఆర్ఎస్ నాయకులు ఆకుల శివ, ఉల్లిగడ్డ శాంత్‌కుమార్, వాదోని రాజు, శ్రీనివాస్, గంధిగా రాజు, కోదూరి అంజయ్య, సాతిని శ్రీశైలం, శ్రీధర్‌రెడ్డి, డప్పు నర్సింహులు, నాసీర్ జబ్బర్, నాగుల విజయ్, బారాడి శివ పాల్గొన్నారు.

## చీమలపాడ్‌లో క్రైస్తవుల సంబరాలు

**సిర్గాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీమల్‌పాడ్‌లో ఆదివారం రాత్రి చర్చి ప్రాంగణంలో క్రైస్తవులు ఈస్టర్ పండగ వేడుకలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామంలో నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది.



సిఆర్‌పిల ఎంపికలో పాల్గొన్న అధికారులు తదితరులు

## నర్సాపూర్ మండల సమాఖ్యలో సిఆర్‌పిల ఎంపిక

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో చిలిపిచెడు, నర్సాపూర్, కౌడిపల్లి మండలాలకు సంబంధించిన ఎస్‌విఈపిసిఆర్‌పిల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్, రాష్ట్ర కార్యాలయం నుండి వచ్చిన అరుణ్, కుటుంబ స్త్రీ నుండి శ్రేయస్ ఆధ్వర్యంలో ఈ ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు మండలాలకు చెందిన ఆసక్తిగల మహిళలతో రాత పరీక్ష, యాక్టివిటీ ద్వారా వారికి అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల ద్వారా ఎస్‌విఈపిసిఆర్‌పిలను ఎంపిక చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలిపిచెడ్, నర్సాపూర్, కౌడిపల్లి మండలాల నుండి ఏపిఎం గౌరీ శంకర్, సీసీలు దేవి సింగ్, రవీందర్, నాగరాజు, భాగ్య, ప్రవీణ, పురుషోత్తం, శ్రీకాంత్, వెంకటలక్ష్మి, అకౌంటెంట్ మల్లేషం, సిఆర్‌పి అభ్యర్థులు పాల్గొన్నారు.

## బేటి బచావో-బేటి పడావోపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీవో స్వరూప రాణి

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** ఆడపిల్లలను చదవుతో పాటు రక్షించాలని సీడీపీవో స్వరూప రాణి అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బేటి బచావో-బేటి పడావో, పోషణ పక్వాడ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆడపిల్లల పట్ల చిన్నచూపు చూడొద్దని, ఆడపిల్లలు లేనిదే సృష్టి లేదన్నారు. గర్భిణీలు పోషకాహారం తీసుకున్నప్పుడే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా పుడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మన్నన్, ఎంపీడీఓ దామోదర్, ఐకెపి ఏపీఎం లక్ష్మీనారాయణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టిచర్లు పాల్గొన్నారు.

## బోరు మోటార్ అందజేత

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** మండలపరిధి ఖాజాపూర్ గ్రామ పంచాయతీ కావేరి పరిశ్రమ యజమాన్యం సోమవారం బోరు మోటార్‌ను అందించింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న బోరు మోటార్ చెడిపోవడంతో గ్రామస్తులు పరిశ్రమ యజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కావేరి పరిశ్రమ యజమాన్యం గ్రామ పంచాయతీకి 5 హెచ్‌పి మోటార్ పంపును అందించింది. అడిగిన వెంటనే సమస్యను పరిష్కరించిన కావేరి స్టీల్ పరిశ్రమ యజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

### మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**చిన్నశంకరంపేట, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. సోమవారం ధర్పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. కేంద్రాలలో తాగునీరు, గన్ని బ్యాగ్‌లు, టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, అన్ని రకాల రిజిస్టర్‌లను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్ధార్ మన్నన్, రాజశేఖర్, రైతులు ఉన్నారు.



ధర్పల్లిలో కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్



మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బిఆర్ఎస్ నేతలు

## అకాల వర్షం.. తడిసిన ధాన్యం

**హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** అకాల వర్షాలతో రైతులు ఆగమౌతున్నారు. హుస్నాబాద్ మండలం సోమవారం ఈదురు గాలులతో కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ యార్డులో తూకం పెట్టిన ధాన్యంతో పాటు తూకం వేసేందుకు సంచుల్లో నింపిన వడ్లు పూర్తిగా నానిపోగా కొంత మంది ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోతుండగా చేసేది లేక అన్న దాతలు లబోదిబోమన్నారు. కొంత మంది రైతులు ముందుగా వచ్చిన గాలిదుమారంలోనే వడ్లను దగ్గరకు చేసుకుని టార్పాలిన్ కవర్లు కప్పి కాపాడు కోగా వర్షం వచ్చే సమయానికే ధాన్యం వద్దకు చేరుకోగా ధాన్యం అంతా తడిసి ముద్దైపోయింది. ఇదిలా ఉంటే బలంగా వీచిన ఈదురుగాలికి పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో ఉన్న మల్లెచెట్టు విరిగి కింద పడగా దగ్గరలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పగా, డిపో రోడ్డులో ఉన్న రేకుల షెడ్లకు ఉన్న రేకులు దుమారానికి లేచి రోడ్డుకు కొట్టుకువచ్చాయి. ఇక గ్రామాలలో ఉన్న మామిడి తోటలలో మామిడి కాయలు నేలరాలగా కొన్ని చెట్లు సైతం విరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. సోమవారం మధ్యాహ్నం హుస్నాబాద్ మార్కెట్ కమిటీలో తడిసిన ధాన్యాన్ని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జునరెడ్డి కొనగోలు సెంటర్‌లలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు మానుకోవాలి

### -లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ నేత మర్కంటి కనకయ్య

**గజ్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు మానుకోవాలని లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ నేత మర్కంటి కనకయ్యముదిరాజ్ విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో గతంలోనే సిసి రోడ్డు నిర్మాణానికి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి. రాజమౌళితోపాటు మాజీ కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మికనకయ్యతో కొబ్బరికాయ పనులను ప్రారంభించారని, నిధులు మంజూరయ్యాయని, నేడు హడావుడిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మరోసారి కొబ్బరికాయ కొట్టడం సరైందికాదన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నుండి గజ్వేల్‌కు ఏమి చేసిందో చెప్పాలన్నారు. అధికారంలోకి రావడంతోనే గజ్వేల్ నియోజకవర్గానికి 170 కోట్ల రూపాయలు అభివృద్ధికి మంజూరుచేసి కాంట్రాక్టర్లకు ప్రొసీడింగ్ ఇప్పిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను రద్దు చేసి రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి తరలించారన్నారు. మున్సిపాలిటీలో 7.50 కోట్లు అభివృద్ధి పనుల కోసం మంజూరు కాగా వాటిని కూడా కొడంగల్‌కు తరలించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి మున్సిపాలిటీ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు సరిగ్గా రావడంలేదన్నారు. గజ్వేల్ మీద ప్రేమ ఉంటే 170 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకొని 21జీజేఎల్7: పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

## సర్కార్ బడులపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన



పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

**మర్కుక్, ఏప్రిల్ 21(ప్రభాతవార్త):** సర్కార్ బడుల్లో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు, విద్యాబోధనపై గ్రామంలో పర్యటిస్తూ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దయాకర్ రావు తెలిపారు. సోమవారం పాతూరు గ్రామంలో మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులతోకలిసి ఇంటింటికి తిరుగుతూ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలు బడిలో చేరాలని బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్కార్ బడుల పనితీరు, ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం చేస్తున్న కృషిని వివరిస్తూ బడిలో పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, రెండు జతల దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బివిఆర్ఐటిలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

**నర్సాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** నర్సాపూర్ సమీపంలోని బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజు, విష్ణు పాఠశాల ప్రిన్సిపల్ జామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ 28 నుండి మే 20 వ తేదీ వరకు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్లు తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కళాశాలలో బివి రాజు విజ్ఞాన కేంద్రం ద్వారా గత ఆరు సంవత్సరాల నుండి ఈ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం కూడాఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈ స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులో చేరిన విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత రవాణా సౌకర్యం కోసం బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సు నర్సాపూర్ ఎంపీడీవో కార్యాలయం నుండి ఉదయం 9 గంటలకు బయలుదేరి తిరిగి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులను దింపుతామని తెలిపారు. నర్సాపూర్ పరిసర గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సంజయ్ దూబే, మేనేజర్ బాపిరాజు, పాఠశాల ప్రిన్సిపల్ జామీలు కోరారు. ఆసక్తిగల విద్యార్థులు 9951551376 మరియు 9866244277 ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించగలరని వారు తెలిపారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### ఎఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌పరిధిలోని 3వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి రూ.5 కోట్లు మంజూరు చేశారని, సిసి రోడ్లు, మురికి కాల్వల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు మొదటి విడత ఇళ్లు మంజూరు చేసి లక్ష రూపాయల చొప్పున అందజేసినట్లు తెలిపారు. అంతేకాకుండా సన్న బియ్యం పంపిణీతో పేద వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయని, బడుగు, బలహీన వర్గాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి పనిచేస్తున్నామని, ఎస్సీ వర్గీకరణ, కుల గణన, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్, అర్హులైన రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వంటి సాహసోపేత నిర్ణయాలతో ప్రజాపాలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల జీవితాలలో వెలుగులు నింపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, 3వ వార్డు కాంగ్రెస్ పార్టీనాయకులు ఊడెం సారిక శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ ఎండి.షరీఫ్, కొనమైన కన్నా యాదవ్, కొల్లూరి సత్యం, గుండు లక్ష్మణ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు శివులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సమీర్, గుంటుకు శ్రీనివాస్, బెజుగామ శివారెడ్డి, మల్యాల భద్రయ్య, ఏఎంసి డైరెక్టర్ అక్కారం యాదగిరి, మల్లారెడ్డి, అరుణ్‌కుమార్, పెర్క నాగరాజు, జూపల్లి లక్ష్మణ్, కృష్ణయాదవ్, అరుణ్‌కుమార్, యూనుస్‌ఖాన్, రాంబాబు, పెర్క రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష

### -21 మందికి రూ.15 వేల జరిమానా

**గజ్వేల్, ఏప్రిల్ 21 (ప్రభాతవార్త):** డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒక వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష విధించడంతో పాటు మరో 21 మందికి రూ.15వేల జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతకొన్ని రోజులుగా గజ్వేల్ పట్టణంలోని పిడిచెడ్, క్యాసారం, తూప్రాన్, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్ రోడ్డులలో, ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కాగా వారిని సోమవారం గజ్వేల్ జ్యుడీసియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక ముందు హాజరుపర్చగా విచారణ చేసి 21 మందికి రూ.15వేల జరిమానా విధించారు. రాయపోల్ మండలం చిన్నమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన గొడుగు కుమార్‌కు మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు సిఐ మురళి తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని, రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**చిన్నకోడురు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త :** మండలంలోని మందపల్లి స్టేజి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకుని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన మీసం శివయ్య 49సిద్దిపేటలో కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తాడని తన సొంత గ్రామం నుండి సిద్దిపేటకు వెళ్తున్న సందర్భంలో గుర్తు తెలియని వాహనం ఢీకుని మృతి చెందినట్లు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బడిబాట నిర్వహిస్తున్న ఎంఈఓ రాజశేఖర్‌శెట్కార్

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : ఎంఇఓ

**మనూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులు నాణ్యమైన విద్యను అందుకోగలుగుతారని మండల విద్యాధికారి రాజశేఖర్ శెట్కార్ అన్నారు. సోమవారం మనూర్‌లో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయుతో కలిసి ఎంఈఓ బడిబాట పట్టారు. గ్రామంలో తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉచితంగా యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు అందుకుంటారని, అర్హత కల్గిన ఉపాధ్యాయులే పాఠాలను బోధిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు రాములు, రాజ్‌కుమార్, ప్రసన్నకుమార్, మచ్చేందర్, రవికుమార్, విఠల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖాజాపూర్‌లో బడిబాట వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


ఖాజాపూర్‌లో బడిబాట వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

**సిర్గాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఖాజాపూర్‌లో సోమవారం బడిబాట కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు మారుతీరావు, ఉపాధ్యాయులతో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఆర్‌పి శివకుమార్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సీమాంజనేయ ఆలయ వార్షికోత్సవం

**సిర్గాపూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామశివారులోని శ్రీసీమాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. వార్షికోత్సవాలను పురస్కరించుకుని సోమవారం వేదపండితులు శ్రీనివాస్, ప్రవీణ్‌పంతులు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి మ్యుసూక్త యజ్ఞం మహోత్సవాలు పూర్ణాహుతి, మమ మంగళహారతి, మహానైవేద్యం, మంత్రపుష్పం పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమాలకు గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు : ఎంపిడిఓ


హద్నూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల కమిటీతో సమావేశమైన ఎంపిడివో

**న్యాల్‌కల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్లకు ధరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ మంజూరవుతాయని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కవలాస్ రాజశేఖర్ అన్నారు. సోమవారం హద్నూర్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ బాధ్యులతో ఎంపిడిఓ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేసుకున్నవారిని ఎంపిక చేసే ధానంపై ఎంపిడిఓ కమిటీ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ధన్‌రాజ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ బాధ్యులు డప్పూర్ సంగారెడ్డి, బేగరి వీరేశం, మాతంశెట్టి మధుసూదన్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ప్రొఫెసర్ల సమ్మె


జేఎన్టీయూ గేటు వద్ద నిరవదిక సమ్మె చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

**చౌటకూర్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రధాన గేటు వద్ద సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం యూనివర్సిటీల కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా కళాశాల గేటు వద్ద అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో 1445 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా బోధన చేస్తున్నారని వివరించారు. పరిష్కారానికి నోచుకోకుండా గడిచిన నెల రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తునే సమ్మెకు దిగామన్నారు. కళాశాలలో విద్యను అందుకుంటున్న విద్యార్థులు పాఠాలు బోధించే వారు లేక అవస్థలు పడాల్సి వచ్చింది. యూనివర్సిటలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని ఆరోపించారు. కాంట్రాక్ట్ ప్రొఫెసర్లను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఉద్యోగ భద్రత కల్పించి వెంటనే విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన బేతాళ స్వామి దేవాలయం

**అల్లాదుర్గ, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కొనసాగుతున్న బేతాళ స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆయా ప్రాంతల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయంలో దర్శనానికి భక్తులు కొంత ఇబ్బంది పడ్డాల్సి వచ్చింది. ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కులో భాగంగా ఆలయంలో బోనాలు సమర్పించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో సిఐ రేణుక, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డిలు తమ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.


అల్లాదుర్గంలో బేతాళ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

# అర్హులైనవారికి 'ఆర్‌వైవి'ని అందించాలి

### బ్యాంకర్ల సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి బ్యూరో ఏప్రిల్ 21, ప్రభాతవార్త :** కలెక్టరేట్లో రాజీవ్ వికాసం పథకంపై బ్యాంకర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా అరులైన వారికి ఈ పథకం వర్తింపజేయాలన్నారు. ఈ పథకంలో అర్హులైన నిరుద్యోగులకు ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువవికాసం పథకాన్ని అందించాలన్నారు. నిరుద్యోగ యువతను స్వయం ఉపాధి వైపు ప్రోత్స హించేందుకు ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా అమలు తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో అనూహ్య స్పందన లభించిందనీ ఆయా వర్గాలకు చెందిన నిరుద్యోగుల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయన్నారు. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించగా రూ.50వేలు మొదలుకుని రూ.4లక్షల వరకు రుణం పొందేందుకు పథకాలను ప్రభుత్వం నిర్వహించిందని ఈనెల 14వ తేదీతో దరఖాస్తు సమర్పణకు ప్రభుత్వం ఆన్లైన్లో చివరి తేదీగా నిర్ణయించిందన్నారు. జిల్లా మొత్తంలో 51,657మంది దరఖాస్తులు సమర్పించారని అత్యధికంగా బీసీ వర్గాల నుంచి 6,546 యూనిట్లకుగాను 23,681, ఎస్సీ విభాగంలో 7,415 యూనిట్లకు 14,480, మైనార్టీ విభాగం లో 2,456 యూనిట్లకు 8,378, ఎస్టీ విభాగంలో 2,502 యూనిట్లకు 4,232, ఈబీసీలో 1,654 యూనిట్లకు 817 దరఖాస్తులను సమర్పించాలని తెలియజేశారు. రాజీవ్ యువ వికాసం పథకాన్ని నాలుగు కేటగిరీ జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా యూనిట్లను మంజూరు చేసివారికి ప్రొసీడింగ్సు అందచేయనున్నారని, ఈ పథకంలో మొదట నిస్స హాయులు, వితంతువులు, ఒంటరి మహి ళలు, దివ్యాంగులు, నిరుద్యోగులు, ఇదివరకు ప్రభుత్వం నుంచి స్వయం ఉపాధి పథకాల రుణాలు పొందని వారికి ప్రాధాన్యతా క్రమంలో మంజూరు చేయనుందని పేర్కొన్నారు. పథకం కింద అర్హత పొందిన వారికి రెండు దఫాలుగా వారి ఖాతాల్లో నగదు జమకానుంది. తొలుత సగభాగం యూనిట్లు కొనుగోలు చేసే సమయంలో, మిగిలిన సగభాగం యూనిట్లు కొను గోలు చేసిన తర్వాత అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, పిడి డిఆర్డిఏ జ్యోతి, ఈడిఎస్‌సి కార్పొరేషన్ రామాచారి, సాంఘిక సంక్షేమ శాఖ/ గిరిజన సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్, ఎల్ డి ఎం గోపాల్ రెడ్డి, జిల్లా అల్ప సంఖ్య సంక్షేమ అధికారి దేవుజా , వివిధ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.


తుల్జాభవాని మాత ఆలయ 32వ వార్షికోత్సవంలో పాల్గొన్న మహిళలు

## వైభంగా తుల్జా భవాని ఆలయ వార్షికోత్సవం

**పుల్‌కల్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో వెలిసిన తుల్జాభవాని ఆలయ 32వ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు సోమవారం వైభంగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ పూజారి నర్సమాంజ మాత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 250 మంది మహిళా భక్తులకు సదాశివపేటకు చెందిన చిందికేరి సతీష్ కుమార్ దంపతులు అందచేసిన రాగి కలశాలలో మంజీర నది నుంచి నీటిని ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారి విగ్రహానికి అభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం దేవత హోమం, పూర్ణాహుతి, లక్ష దీపారాధన పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు పేర్కొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధ్యానత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు జంక్షన్ వెలిమెల నుంచి వెలిమల తండా, పాటి గ్రామ పరిధిలో 4కోట్ల 58 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న బిటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పూజా కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపల్ పాలక వర్గం ప్రతిపాదించిన పనులకు సైతం ఆర్థిక శాఖ ద్వార అనుమతులు మంజూరు చేయించి త్వరలోనే పనులను ప్రారంభిస్తామన్నారు. హెచ్‌ఎండిఏ పరిధిలోని చెరువులను సైతం ప్రణాళిక బద్దంగా అభివృద్ధి పరుస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్ సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు సోమిరెడ్డి, మాజీ సర్పంచులు లక్ష్మణ్, స్వామి గౌడ్, రాములు యాదవ్, సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, హెచ్‌ఎండిఏ డిఈ రామకృష్ణ, మాజీ కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, సుచరిత కొమరయ్య, శ్రీశైలం, చిట్టిఉమేష్, బాబ్జి, శ్రీకాంత్, నర్సింలు, నాగరాజు, నాయకుల రవీందర్‌రెడ్డి, దేవేందర్ యాదవ్, వెంకటరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలి : ఎస్‌పి

**కొల్చారం, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా సామరస్యంగా సమస్యను పరిష్కరించుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కొల్చారంలో అంబేద్కర్ జయంతి రోజున ఏర్పాటు చేసిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం, అదేస్థలంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకోసం పాతిన జండా స్థలాన్ని సోమవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్, శివాజీ ఇద్దరూ గొప్ప వ్యక్తులని, వారికి అవమానం కలిగించేలా గ్రామస్తులు నడిరోడ్డుపై విగ్రహాలను ఏర్పాటు చేయవద్దని వారుసూచించారు. గ్రామ పెద్దలు యువజన సంఘాలు సభ్యులు కూర్చొని మాట్లాడుకొని సామరస్యంగా సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎవరైనా చట్టానికి అతీతంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేయాలని మెదక్ డిఎస్పి ప్రసన్నకుమార్ కు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్పి ప్రసన్నకుమార్, మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ మహమ్మద్‌గౌస్ ఎమ్మార్పీఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి


పంచాయతీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ

## పంచాయతీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బాలరాజ్

**చౌటకూరు, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం చౌటకూరులోని రైతు వేదికలో ఎన్నుకున్నారు. యూనియన్ అధ్యక్షుడిగా బాలరాజ్, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య, సుందరయ్య, కె.జనార్థన్, ప్రధాన కార్యదర్శిగా దుర్గారావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా రాములు, సహాయ కార్యదర్శులుగా పవన్, పెంటయ్య, కోశాధికారిగా సత్తయ్య, కమిటి సభ్యులుగా చంద్రయ్య, మహేందర్, శంకరయ్య, లాజర్లను ఎన్నుకున్నారు.

## వడగండ్ల వానకు తడిసిన ధాన్యం


వానకకు తడిసిన ధాన్యం

**కొల్చారం, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొంగోడు గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద ఆంబోసిన ధాన్యం తడిసిపోయాయి. సాయంత్రం వాతావరణంలో మార్పులు వచ్చి వడగండ్లు వాన కురవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. కోతలు ప్రారంభమై కొనుగోలు కేంద్రాలలోకి ధాన్యం తరలించి ఆరబెట్టిన ఇంతవరకు కొనుగోలు చేయడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

## సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలి : ఎమ్మెల్యే

**కొల్చారం, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:** వాతావరణం అనుకూలంగా లేనందున వారం రోజులుగా రైతుల నుండి సెంటర్లలో సేకరించిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. కొల్చారం పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన, అప్పాజీపల్లి, పోతంశెట్టిపల్లి ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను సోమవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి తూకానికి కొబ్బరి కాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ధాన్యాన్ని తూకం వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునితారెడ్డి మాట్లాడుతూ కొల్చారం, అప్పాజీపల్లి, పోతంశెట్టిపల్లి గ్రామాల్లో సంబంధించినటువంటి వరి కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించడం జరిగిందన్నారు, రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు, అలాగే రైతు భరోసాతో పాటుగా..పాత బకాయలు 7 కోట్ల ఏడు కోట్ల బోనస్ రూపాయలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఎమ్మెల్యే సునితారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ మనోహర్, సీఈఓ కృష్ణ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు


ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి

# కృత్రిమ మేధస్సుతో కలుపుతీసే యంత్రం

### స్వయంప్రతిపత్తి రోబోట్‌ను ఆవిష్కరించిన బిటెక్ విద్యార్థిని అమూల్య

**పటాన్ చెరు, ఏప్రిల్ 21,ప్రభాతవార్త:**

ఆధునిక వ్యవసాయాన్ని విప్లవాత్మకంగా మార్చ డానికి రూపొందించిన కృత్రిమ మేధస్సు (ఏఐ)తో కూడిన స్వయంప్రతిపత్తి కలుపు తీసే రోబోట్ ను గీతం బీటెక్ చివరి ఏడాది విద్యార్థి సి.అమూల్య, ఆమె బృంద సభ్యులు అభివృద్ధి చేశారు. స్మార్ట్ ఫార్మింగ్ కోసం ఏఐశక్తితో కూడిన స్వయంప్రతిపత్తి కలుపు తీసే రోబోట్ అనే వారి క్యాప్ స్టోన్ (ముగింపు) ప్రాజెక్టులో భాగంగా, ఈ బృందం పంటలకు హాని కలిగించకుండా కలుపు మొక్కలను గుర్తించి తొలగించగల రోబోటిక్ పరిష్కారాన్ని రూపొందించింది. ఈ అత్యాధునిక వ్యవస్థ హానికరమైన కలుపు మందులపై ఆధారపడటాన్ని తగ్గించడమే కాకుండా మానవీయ శ్రమను గణనీయంగా తగ్గించి, పర్యావరణ స్పృహతో కూడిన వ్యవసాయ పద్ధతులను సూచిస్తోంది. టెన్సార్ ఫ్లో లైట్ ద్వారా అమలుచేసి, రాస్ బెర్రీ పై4లో అనుసంధానించిన తేలికైన సీఎన్ఎన్ మోడల్‌ను ఉపయోగించి కలుపు మొక్కలను గుర్తించి తొలగించే స్వయంప్రతిపత్తి రోబోట్‌ను తమ బృందం అభివృద్ధి చేసినట్టు అమూల్య వివరించారు. జీపీఐవో ద్వారా వాస్తవ సమయ ప్లాంట్ వర్గీకరణ, మోటార్ నియంత్రణను తమ వ్యవస్థ నిర్వహిస్తుందన్నారు. వ్యవసాయాన్ని మరింత స్థిరంగా, అందుబాటులోకి తీసుకురావడమే తమ అంతిమ లక్ష్యమని అమూల్య స్పష్టీకరించారు. ఈ ప్రాజెక్టును మరింత మెరుగుపరస్తూ, జీపీఎస్ సాయంతో, సౌరశక్తితో పనిచేసేలా, మరిన్ని పంట రకాలు, ప్రాంతీయ వైవిధ్యాలకు మద్దతు ఇవ్వడానికి డేటాసెట్ విస్తరణ చేపట్టాన్నారు. ఈ వ్యవసాయ ఆవిష్కరణతో పాటు, మరొక అధిక ప్రభావ ప్రాజెక్టును పూర్తిచేసినట్టు అమూల్య వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వివిధ ఎల్క్ట్రానిక్ సిస్టమ్‌లకు అవసరమైన వరుస ఉజ్జాయింపు రిజిస్టర్(ఎస్ఏఆర్) అనలాగ్ టు డిజిటల్ కన్వర్టర్‌లలో సిగ్నల్ విశ్వసనీయతను మెరుగుపరచడంపై దృష్టి సారించినట్టు అమూల్య తెలిపారు. ఈ ప్రాజెక్టుకు మార్గదర్శనం చేసిన ఈఈసీఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్.ప్రవీణ్‌కుమార్, బృంద సభ్యులు కె.మణికంత, శివధనుష్ ముసునూరిలకు ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టులు కృత్రిమ మేధస్సు, ఎంబెడెడ్ సిస్టమ్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్ వంటి వాటిపై అవగాహనను మరింతగా పెంచుకోవడానికి తమకు అవకాశం కల్పించాయన్నారు. అమూల్య, ఆమె బృందం సాధించిన విజయాలను గీతం నాయకత్వం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వీ.ఆర్. శాస్త్రి, అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. సీతారామయ్య, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్‌ఆర్ వర్మ, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి తదితరులు విద్యార్థుల ఆవిష్కరణ, శ్రేష్ఠతలను ప్రశంసించారు.


స్వయంప్రతిపత్తి రోబోట్ ను ఆవిష్కరించిన బిటెక్ విద్యార్థిని అమూల్య


మాట్లాడుతున్న రమణగౌడ్

## ఆరోపణలు కాదు అభివృద్ధి చేసి చూపించండి

### బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణగౌడ్

**శివ్వంపేట, ఏప్రిల్ 21(ప్రభాతవార్త) :** ఆరోపణలు కాదు అభివృద్ధి చేసి చూపియ్యాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణగౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేయకుండా అభివృద్ధి చేసి చూపించాలని ఎమ్మెల్యే సునీతరెడ్డి పై, మాజీ జెడ్పిటిసి పబ్బా మహేష్‌గుప్తాపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందని చెప్పారు. బిఆర్ఎస్ నాయకులపైన, కార్యకర్తలుపైన తప్పుడు ఆరోపణలు చేస్తే కోరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పిటిసి పబ్బా మహేష్ గుప్తా, మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పద్మ వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు ముద్దగల లక్ష్మీ నరసయ్య, సీనియర్ నాయకులు బాసంపల్లి రామా గౌడ్, మాజీ వార్డు సభ్యులు బాసంపల్లి పోచ గౌడ్, మంజరి కొండల్, పంబాల సంతోష్ , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా మేళా

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఈ నెల 22వ తేదీన జిల్లాలోని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు సేవా మేళ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ పిజిఎం రాజరాజేశ్వరి వెల్లడించారు. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులోని జిఎం కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మేళా కొనసాగుతుందన్నారు. సిద్దిపేట పరిధిలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఈ నెల 25న సేవా మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలు, బిల్లులు, సిగ్నల్ తదితర సమస్యలపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## ముగిసిన అగ్నిమాపక సేవా వారోత్సవాలు


బిహెచ్ఈఎల్‌లో అగ్నిమాపక సేవా వారోత్సవాల ముగింపు దృశ్యం

**రామచంద్రాపురం, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ అగ్నిమాపక సేవ వారోత్సవ ముగింపు కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. భద్రతాఇంజనీరింగ్ సమన్వయంతో సిఐఎస్ఎఫ్ అగ్నిమాపక విభాగం వారు వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని వివిధ పోటీలు (నినాదం, వ్యాస రచన, డ్రాయింగ్) నిర్వహించారు. ముగింపు వేడుక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనరల్ మేనేజర్ ఎన్ విజయసాగర్, కమాండెంట్ మంజీత్ కుమార్, ఎస్‌డిజిఎం అరవింద్ కుమార్ తదితర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ అగ్ని మాపక విధానాల ప్రదర్శన, అగ్ని ప్రమాదాల సమయంలో రెస్క్యూ ఆపరేషన్ మాక్ డ్రిల్, గృహ అగ్నిమాపక భద్రత తదితర ప్రదర్శనలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా నిర్వహించన పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందచేశారు.

## నంది కందిలో బడిబాట కరపత్రం ఆవిష్కరణ


బడిబాట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ శంకర్

**సదాశివపేట, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని నంది కంది గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని మండల విద్యాధికారి ఎన్ శంకర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందుకుంటనే వారి భవిష్యత్తు బంగారుమయం కావడం తథ్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా డ్రెస్సులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందచేస్తారని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాల్లో చేరేలా తమ స్నేహితులకు అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవయ్య, అక్బర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మన్ హంసమ్మ, సిఆర్‌పిలు రాజేశ్వర్, మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా బిందాస్ మహారాజ్ శతాబ్ది ఉత్సవాలు

### -ముగింపు ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 21, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని దత్తాత్రే మందిరంలో గత వారం రోజులుగా భీమ్‌దాస్ మహారాజ్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహారెడ్డి విజయపాల్‌రెడ్డి, మహారెడ్డి భూపాల్‌రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్‌కుమార్ శెట్కార్, జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మచ్చేందర్, ఊత్ కాంగ్రెస్ నాయకులు కర్నె శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## రోడ్డుకు అడ్డంగా కుక్కలు.. ప్రమాదాల బారిన ప్రజలు

**కంగ్టి, ఏప్రిలన 21, ప్రభాతవార్త:** రోడ్డుకు అడ్డంగా అకస్మాత్తుగా శునకాలు (కుక్కలు) వస్తుండటంతో వాహన చోదకులు తరుచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద చికెన్, మటన్ దుకాణాలు నిర్వహిస్తుండటంతో వ్యర్థ మాంసపు ముక్కలు అక్కడ పారేస్తుండటంతో కుక్కలు పెద్ద సంఖ్యలో అక్కడ గుమికూడటం జరుగుతోందని, వ్యర్థపదార్థాలు తినేసి ఒక్కసారిగా రోడ్లపైకి పరుగెత్తుకుని వస్తున్న క్రమంలో అటువెళ్లే వాహనాలపై వచ్చేవారు అనుకోకుండా ప్రమాదాలకు గురవుతున్నారు. సోమవారం మండల పరిధిలోని సాధు తండా వద్ద నారాయణఖేడ్ రోడ్డుపై బోర్గి గ్రామానికి చెందిన భూతలే విజయ్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి వివాహ వేడుకల్లో పాల్గొని తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కుక్కలు వాహనానికి అడ్డుగా పరుగెత్తుకుని రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడగా వాహనంపై ప్రయాణిస్తున్న వారు ప్రమాదానికి గురయ్యారు. అదే సమయంలో అటుగా వెళుతున్న హెడ్‌కానిస్టేబుల్ రాజ్ కుమార్ విషయాన్ని గుర్తించి వెంటనే 108కు సమాచారం అందించి క్షతగాత్రులను నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడిన వాహన చోదకులు